

వృద్ధాప్యం.. ఉత్సాహం

నల్లగొండలో దాదాపు 7,700 మంది రిటైర్డ్ ఉద్యోగులున్నారు. క్యారమ్స్, చెస్ ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. - 8లో



నిలిచిపోయిన వాహనాలు

పంతంగి టోల్‌ప్లాజాలో సాంకేతిక సమస్య కారణంగా శనివారం ఉదయం వాహనాలు నిలిచిపోయాయి. - 8లో

గరిష్టం/కనిష్టం 39°/26°

వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

టీచర్ల సర్దుబాటుకు కసరత్తు

విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఆధారంగా కేటాయింపు

- జిల్లా పరిధిలోని స్కూళ్లకు మాత్రమే పరిమితం
- పాఠశాలల వారీగా వివరాలు సేకరిస్తున్న అధికారులు
- 153 మందికి స్థానచలనం కలిగే అవకాశం
- ఈనెల 13వ తేదీలోపే ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిమించేందుకు విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఒక్కో స్కూల్‌లో పిల్లల సంఖ్య, ఎంత మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు, ఇంకా ఎంతమంది అవసరం తదితర వివరాలన్నింటినీ సేకరించి ఒక ప్రొఫార్మాలో నమోదు చేస్తున్నారు. ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో 13లోపే సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

2,939 మంది ఉపాధ్యాయులు

జిల్లాలో 715 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 484 ప్రాథమిక, 163 ప్రాథమికోన్నత, 68 జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా స్కూళ్లలో 38,277 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి 2,939 మంది ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. ఇందులో స్కూల్‌అసిస్టెంట్లు 1,654, ఎస్‌జీటీలు 1,080 మంది ఉన్నారు. మిగతా వారు జీహెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు ఉన్నారు. 153 మందిని సర్దుబాటు చేసే అవకాశముంది.

ఉండాల్సిన ఉపాధ్యాయులు

విద్యార్థుల సంఖ్య	టీచర్లు
1-10	01
11-60	02
61-90	03
91-121	04
121-150	05
151-200	06

200 దాటిన తర్వాత ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి.

సర్దుబాటు చేస్తే వెళ్లేనా?

జిల్లాలో గత ఏడాది జూన్, జూలైలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను రెండు విడతలుగా పూర్తిచేశారు. డీఎస్సీ -2024 ద్వారా కొత్తగా 252 మంది ఉపాధ్యాయులు వచ్చారు. అయినప్పటికీ ఉపాధ్యాయుల కొరత తీరలేదు. సమస్యను అధిగమించేందుకు వలంటీర్లను కూడా నియమించలేదు. దీంతో గత విద్యాసంవత్సరం సెప్టెంబర్‌లో తాతాలికంగా సర్దుబాటు చేశారు. ఇందులో కొందరు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లగా, మరికొందరు ఉపాధ్యాయులు మంత్రులు, ఎమ్మెల్యేల పైరవీలతో యథాస్థానాల్లో ఉండిపోయారు. ఇదే సమయంలో విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరడంతో సర్దుబాటు ప్రక్రియ నిలిపివేశారు. ఈసారి సర్దుబాటు చేసిన పాఠశాలలకు వెళ్తారా, లేదా.. అనేది సందేహంగా ఉంది.

వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

సర్దుబాటును ఉపాధ్యాయుల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈనెల 6నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. కాగా బడిబాట ముగిసిన అనంతరం విద్యార్థుల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని, ఆ తరువాత సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. విద్యాశాఖ నిర్ణయం తీసుకున్న ముందస్తు సర్దుబాటు నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్దుబాటు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపడుతాం. నిబంధనల ప్రకారం అవసరం ఉన్న చోటుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. అయితే ఇందుకు సంబంధించి ఉన్నత అధికారులతో సమావేశం జరగాల్సి ఉంది. –సత్యనారాయణ, డీఈఓ.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

ఒక గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధ్యాయులు సర్దుబాటు అవసరం లేదు అనుకుంటే స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సర్దుబాటు చేయాలి. అక్కడా అవసరం లేదనుకుంటే మండల పరిధిలో, ఆ తర్వాత పక్క మండలంలో, అనంతరం జిల్లా పరిధిలో పంపవచ్చు. గత ఏడాది జారీ చేసిన మార్గదర్శకాలతో పాటు ఈ సారి కొత్త నిబంధనలు చేర్చారు. ఏజెన్సీ ప్రాంతం ఉంచి మైదానం ప్రాంతానికి సర్దుబాటు చేయవద్దు. దీంతో పాటు ఏజెన్సీ ఏజెన్సీ ప్రాంతానికి మాత్రమే సర్దుబాటు చేయాలని సూచించారు. పరస్పర సర్దుబాటు చేసుకోవద్దని విద్యాశాఖ నిర్ణయించింది.

బడిబాట ముగిసిన తరువాత చేపట్టాలి



బడిబాట కార్యక్రమం ముగిసిన అనంతరం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందా, అదే విధంగా ఉంటుందా తెలుస్తుంది. దీన్ని ఆధారంగా సర్దుబాటు చేయాలి. అలాగే 1నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నిర్ణయించారు. అయితే 1 నుంచి 30 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు ఉండే విధంగా నిర్ణయం తీసుకోవాలి.

–మెతుకు సైదులు, టీఎస్‌యూటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి

నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



మే, జూన్ మాసాల్లో బడిబాట నిర్వహించి విద్యార్థుల నమోదు పెంచాలని ఓ వైపు చెబుతూనే మరోవైపు జూన్ 13 లోపు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయంచడ తగదు. నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. తరగతికి ఒక ఉపాధ్యాయుడినే నియమించాలి. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. విద్యార్థులు తక్కువ ఉన్నారనే సాకుతో సర్దుబాటు చేయడం సరికాదు.

–లక్ష్మీనర్సింహారెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

• థాయిలాండ్ భామకే కిరీటం



మిస్ వరల్డ్‌గా థాయిలాండ్ భామ ఎంపికైంది. గతకొన్ని రోజులుగా హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న విషయం తెలిసిందే. శనివారం జరిగిన ఫైనల్ పోటీలో థాయిలాండ్ దేశానికి చెందిన ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ ఎంపికైంది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లతో కలిసి ఈమె గత నెల 12న నాగార్జునసాగర్‌కు వచ్చి సందడి చేసింది. ఆ దృశ్యమే ఇది.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా భాస్కర్‌రావు



సాక్షి,యాదాద్రి : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా భాస్కర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న గంగాధర్‌ను హెచ్‌ఎండీఏ కార్యదర్శిగా ప్రభుత్వం రెండు నెలల క్రితం బదిలీ చేసింది. అప్పటినుంచి ఈ పోస్ట్ ఖాళీగా ఉండగా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఈ బాధ్యతలు చూస్తున్నారు. యాదగిరిగుట్ట ఆలయ ఈఓగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌రావును ఏప్రిల్ నెలాఖరులో రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. తిరిగి ఆయన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు. భాస్కర్‌రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో కూడా భాస్కర్‌రావు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా పని చేశారు.



ఆలయ మాడ వీధిలో భక్తుల మధ్య స్వామి, అమ్మవారి వెండి జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం జరిగిన నిత్యపూజా కార్యక్రమాల్లో భాగంగా స్వామి, అమ్మవారి వెండి జోడు సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. సాయంత్రం స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వేర్వేరు సేవలపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఉత్సవమూర్తులను కనులారా వీక్షించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు సుప్రభాత సేవ, నిజాభిషేకం, తులసీదళ అర్చన, సుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.

10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం

- రేపటి నుంచి అమల్లోకి
- వీలున్న రోజు, అనుకున్న సమయానికి వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్
- గంట వ్యవధిలోనే చేతికందనున్న డాక్యుమెంట్లు



గంటలోనే డాక్యుమెంట్ సిద్ధం

గతంలో రిజిస్ట్రేషన్ అయిన తర్వాత డాక్యుమెంట్ల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ, స్లాట్ బుకింగ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తయిన గంటలోనే దస్తావేజులు చేతికిరానున్నాయి. మ్యూటేషన్ కోసం గ్రామ పంచాయతీ, మున్సి పల్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇక్కడే మ్యూటేషన్ కూడా పూర్తవుతుంది.

నల్లగొండ : రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులభతరం కానుంది. వ్యవసాయేతర భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు తదితర ఆస్తుల డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి కార్యాలయాల్లో నిరీక్షించాల్సిన అవసరం ఇకపై ఉండదు. పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తెస్తోంది. యాదగిరిగుట్ట, బీబీనగర్, చౌటుప్పల్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానం విజయవంతం కావడంతో ఈనెల 2నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

ఉమ్మడి జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా వ్యవసాయేతర భూములు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. ఆస్తులు అమ్మినవారు, కొన్న వ్యక్తులు, సాక్ష్యులు డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదించడంతో పాటు వ్యక్తిగతంగా సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు చాలా సమయం పడుతుండటంతో ఆ రోజంతా కార్యాలయం వద్దనే వేచి ఉండాల్సి వచ్చేది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనూ ఆలస్యం జరిగేది. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా తాము అనుకున్న రోజు 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

రోజుకు 48 స్లాట్‌లు..

నూతన విధానం ద్వారా ఒక్కో సబ్ రిజిస్ట్రార్‌కు రోజుకు 48 స్లాట్లు కేటాయించనున్నారు. ఉదయం 24, మధ్యాహ్నం 24 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయనున్నారు. అత్యవసరమైతే సాయంత్రం 5 గంటల తర్వాత ఐదు అదనపు రిజిస్ట్రేషన్లను స్లాట్‌తో సంబంధం లేకుండా నేరుగా రిజిస్ట్రేషన్ చేయవచ్చు. ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లున్న చోట ఒకొక్కరు 48 చొప్పున 96 రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రస్తుతం అత్యధిక డాక్యుమెంట్లు అవుతున్న నల్లగొండ, సూర్యాపేట, యాదగిరిగుట్ట ఇద్దరు చొప్పున సబ్ రిజిస్ట్రార్లు ఉన్నారు.

సేవలు సులభతరం

స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం కానున్నాయి. 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి కొనుగోలుదారుకు దస్తావేజులు అందిస్తాం. ఈ విధానం ద్వారా కొనుగోలుదారుడు అనుకున్న రోజు, అనుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ అవడంతో పాటు గంట వ్యవధిలోనే అతనికి చేతికి డాక్యుమెంట్లు అందుతాయి.

–ప్రవీణ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్

ముఖ్యమంత్రి సభా స్థలం మార్పు

- తిర్మలాపూర్‌లో సభ ఏర్పాటుకు నిర్ణయం
- పరిశీలించిన కలెక్టర్, డీసీపీ

తుర్కపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 6న జిల్లా పర్యటనలో భాగంగా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో నిర్వహించతలపెట్టిన బహిరంగ సభను వివిధ కారణాలతో తిర్మలాపూర్‌కు మార్చారు. కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంక్ష్‌యాదవ్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి శనివారం తిర్మలాపూర్‌ను సందర్శించి సభాస్థలి, హెలిపాడ్‌కు అనువైన ప్రదేశాన్ని పరిశీలించారు. సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వారి వెంట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, సీఐ శంకర్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ ఎలగొండ కృష్ణ, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎస్‌ఐ తకియొద్దీన్, ఏఈ రఘు రామారావు, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, నాయకులు దనవత్ శంకర్ నాయక్, చాడ భాస్కర్‌రెడ్డి, మోహన్‌బాబు, రాజారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



డీసీపీ, అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మణిహారం.. మినీ శిల్పారామం

రాయగిరి చెరువు చెంతన రెండు ఎకరాల్లో ఏర్పాటు

- కనువిందు చేస్తున్న గ్రీనరీ
- చిన్నలు, పెద్దలకు బోటింగ్ సౌకర్యం
- హస్తకళలు, అలంకరణ వస్తువుల విక్రయానికి స్టాల్స్
- 2వ తేదీన ప్రారంభించనున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



భారీ స్వాగత తోరణం

మినీ శిల్పారామం ప్రారంభంలో తాటిచెట్టు మొద్దులు, ఫైబర్ మెటల్‌తో భారీ స్వాగత తోరణం ఏర్పాటు చేశారు. దీనికి ఇరువైపులా ఏర్పాటు చేసిన గుర్రాల విగ్రహాలు, ఒడిశానుంచి తెచ్చిన రాతి శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

సాక్షి, యాదాద్రి : శిల్పారామం అనగానే హస్తకళలు.. అలంకరణ వస్తువులు, ఆహ్లాదకరమైన పల్లెవాతావరణం గుర్తుకొస్తుంది.. వీటితో పాటు పిల్లలకు వినోదం కూడా లభిస్తోంది.. అలాంటి శిల్పారామమే ఇప్పుడు రాయగిరి చెరువు వద్ద మినీ శిల్పారామం పేరుతో రూపుదిద్దుకుంది. మూడేళ్లుగా సాగుతున్న పనులు పూర్తి కావడంతో జూన్ 2న ప్రారంభించేందుకు వైటీడీఏ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రెండు ఎకరాల్లో ఏర్పాటు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచడంతో పాటు పర్యాటకులను ఆకర్షించేందుకు భువనగిరి-యాదగిరిగుట్ట మధ్య రాయగిరి చెరువు వద్ద రెండు ఎకరాల్లో రూ.5కోట్ల వ్యయంతో మినీ శిల్పారామం ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైటీడీఏ ఆధ్వర్యంలో ప్రారంభించిన పనులు.. దాదాపు పూర్తయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు మినీ శిల్పారామం వేదిక కానుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళల స్టాళ్లు, సాండ్ స్టోన్ శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు వాటర్‌ఫాల్స్, బోటింగ్, వ్యూ పాయింట్, ఫుడ్‌కోర్టు, లాన్, రకరకాల పూల మొక్కలు .. ఇలా మరెన్నో కనువిందు చేస్తున్నాయి.



మినీ శిల్పారామంలో ఫుడ్ కోర్టు హాల్

క్రాఫ్ట్ విలేజ్‌లో స్టాళ్లు.. మినీ శిల్పారామంలో క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు చేస్తున్నారు. తొలుత పది స్టాళ్లను సిద్ధం చేస్తున్నారు. వీటిలో పెంబర్తి లోహపు శిల్పాలు, షీల్డులు, కొయ్యలగూడెం, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు తదితర హాండీక్రాఫ్ట్స్ విక్రయించనున్నారు. స్టాల్స్‌ను నామమాత్రపు రేటుతో సొసైటీలకు కేటాయిస్తారు.

2వ తేదీన ప్రారంభిస్తాం : కిషన్‌రావు

మినీ శిల్పారామాన్ని సోమవారం సాయంత్రం ప్రారంభించనున్నట్లు శిల్పారామం ప్రత్యేకాధికారి జి.కిషన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి క్రిష్ణారావు, రోడ్లు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు. రాయగిరి చెరువు ప్రాంతమంతా ప్రకృతి రమణీయత ఉట్టిపడుతోంది. యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చే భక్తులు తిరుగుపయనంలో రాయగిరి చెరువుకట్టపై పెద్ద సంఖ్యలో సేద దీరుతున్నారు.

సేదదీరేందుకు గ్రీనరీ

శని, ఆదివారాలతో పాటు ప్రత్యేక రోజుల్లో యాదగిరి క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. తిరుగుపయనంలో చెరువు కట్టపై, మైసమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రీనరీలో సేదదీరుతారు. తమ వెంట తెచ్చుకున్న ఆహార పదార్థాలను ఆరగిస్తుంటారు.చిన్నారులు, పెద్దలు ఉల్లాసంగా గడుపుతారు. మినీ శిల్పారామం అందుబాటులోకి వస్తే భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశముంది.



పర్యాటకులు కూర్చోవడానికి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన అవుట్ దోర్ సీటింగ్

బోటింగ్ సౌకర్యం, చిన్నపిల్లలకు ప్లేగ్రౌండ్

పెద్దలు, చిన్నారుల కోసం బోటింగ్ సౌకర్యం కల్పించారు. ఒక్కో బోట్ 15 నుంచి 20 మంది సామర్థ్యం కలిగి ఉంటాయి. మొత్తం మూడు బోట్లు ఏర్పాటు చేస్తున్నారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేకంగా ప్లే గ్రౌండ్, అందులో జారుడు బండ, రంగుల రాట్నం వంటి వస్తువులు సమకూర్చారు.



వాటర్ జెట్స్

చెరువులో ఐదు వాటర్ జెట్స్ ఏర్పాటు చేశారు. ఇవి వివిధ పుష్పాల ఆకారంలో 40 ఫీట్ల ఎత్తులో నీటిని చిమ్ముతూ భక్తులను ఆకట్టుకోనున్నాయి. వీటితో చెరువు అలుగు ప్రాంతాన్ని వాటర్ ఫౌంటెయిన్ మాదిరిగా తీర్చిదిద్దారు.



ధూమపానంతో తీవ్ర అనర్థాలు



ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు

- అదనపు జిల్లా జడ్జి ముక్తిదా

భువనగిరి : ధూమపానం చేయడం వల్ల అనేక అనర్థాలు తలెత్తుతాయని జిల్లా మొదటి అదనపు జడ్జి ముక్తిదా పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం భువనగిరిలోని జిల్లా కోర్టు ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగ తాగడం వల్ల జీవితం ఛిద్రమవుతుందన్నారు.గొంతు క్యాన్సర్ వస్తుందని, శ్వాసనాళాలు, ఊపిరితిత్తులు పాడవడం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. అంతేకాకుండా ఆర్థికంగా నష్టపోతారని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వాతి, జిల్లా మానసిక ఆరోగ్యశాఖ అధికారి ప్రీతి స్వరూప్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వివి గౌడ్, కార్యదర్శి బొల్లేపల్లి కుమార్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వచ్ఛంద సంస్థలతో పరిశుభ్రత చేపట్టాలి

● యాదగిరిగుట్ట ఈఓ వెంకట్రావ్


భక్తులతో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఈఓ వెంకట్రావ్ సంబంధిత ఉద్యోగులకు సూచనలు చేశారు. శనివారం రాత్రి ఆయన ఆలయ పరిసరాలను తనిఖీ చేసి మాడ వీధులు అపరిశుభ్రంగా ఉండటంతో శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ కాంట్రాక్ట్‌కు సంబంధించిన మ్యాన్‌పవర్‌తో ఆలయ పరిసరాలు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతకు సంబంధించి ఆలయ పరిసరాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతపై భక్తుల ద్వారా అభిప్రాయాలు తీసుకున్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ బలవన్మరణం

తిప్పర్తి: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిప్పర్తి మండలం కంకణాలపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. తిప్పర్తి ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కంకణాలపల్లి గ్రామానికి చెందిన గంటికంపు క్రిష్ణయ్య (42) కొంతకాలంగాగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తప్పిపోయిన బాలుడు కుటుంబ సభ్యుల చెంతకు..


హోంగార్డు శ్రీశైలంతో బాలుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్టకు శనివారం కుటుంబ సభ్యులతో వచ్చిన ఓ బాలుడు కొండపైన తప్పిపోయాడు. ఎస్పీఎఫ్ ఎస్‌ఐ అనిల్, ఏఎస్‌ఐ రాజయ్య, హోంగార్డు శ్రీశైలం చెప్పిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అంజలిపురానికి చెందిన రఘువీరారెడ్డి తన తల్లి సీత, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరీశుడిని దర్శించుకునేందుకు వచ్చాడు. సాయంత్రం సమయంలో భక్తులు అధికంగా ఉండటంతో దర్శనానికి వెళ్తూ తప్పిపోయాడు. ఆలయ పరిసరాల్లో ఏడుస్తూ కనిపించిన రఘువీరారెడ్డిని అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీశైలం గుర్తించి, ఆలయ విచారణ కార్యాలయం వద్ద మైక్ అనౌన్స్‌మెంట్ చేయించి, బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వృద్ధాప్యం.. ఉత్సాహం

వారంతా జీవితాన్ని కాచివడపోసిన అనుభవజ్ఞులు. ఆరుపదుల వయస్సు దాటడంతో కృష్ణా.. రామా.. అని ఇంట్లో కూర్చోవాలనే పాత నానుడిని పక్కన పెట్టి జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. నిత్యం ఆటపాటలతో, చర్చాగోష్టులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు. ఉద్యోగాల నుంచి రిటైర్డ్ అయినప్పటికీ శరీరానికే వయస్సు.. మనస్సుకు కాదంటూ తగ్గేదేలేదంటున్నారు. కష్టసుఖాలు, ఆరోగ్య సూత్రాలు, అనారోగ్య సమస్యలు చెప్పకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఇలా రిటైర్డ్ ఉద్యోగుల ఆటవిడుపునకు వేదికయ్యాయి నల్లగొండ, కోదాడలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనాలు.

- నల్లగొండ టూటౌన్, కోదాడ


నల్లగొండ పెన్షనర్ల భవన్‌లో చెస్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు


పాట పాడుతున్న రిటైర్డ్ ఉద్యోగి

- ఆటపాటలకు వేదికగా మారిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనాలు
- క్యారమ్స్, చెస్ ఆడుతూ ప్రశాంత జీవితం గడుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు
- రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణింపు
- అప్పుడప్పుడు విహారయాత్రలు

సండే స్పెషల్

నల్లగొండ పట్టణంలో దాదాపు 7700 వరకు రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 3800 మంది వరకు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘంలో సభ్యత్వం తీసుకొని వారు చేసే కార్యక్రమాల్లో వీలైనప్పుడు భాగస్వాములవుతున్నారు. అదేవిధంగా 70 నుంచి 100 మంది వరకు ప్రతిరోజు జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న పెన్షనర్స్ భవన్‌కు వచ్చి కాలక్షేపం కోసం క్యారమ్స్, చెస్ ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. అదేవిధంగా కోదాడ పట్టణంతో పాటు సమీప గ్రామాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ కలిసి కోదాడ పట్టణంలోని నయానగర్‌లో విశ్రాంత ఉద్యోగుల భవనాన్ని నిర్మించుకున్నారు. దాదాపు 2500 మందికి ఇందులో సభ్యత్వం ఇచ్చారు. ఈ భవనంలో క్యారమ్స్, చెస్ వంటి ఆటలు ఆడుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. పలువురు రిటైర్డ్ ఉద్యోగులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటారు.

గాన కచేరి చేస్తూ.. నవ్వులు పూయిస్తూ..

రిటైర్డ్ ఉద్యోగులు సంఘం భవనాలకు చేరుకొని తమ అనారోగ్య సమస్యలపై చర్చించుకోవడం, కుటుంబ సభ్యుల నేపథ్యం తదితర సమాచారం పంచుకుంటున్నారు. పిల్లలు తమ వద్ద లేకున్నా రిటైర్డ్ ఉద్యోగుల్లో ఎవరి ఏ సమస్య వచ్చినా పది మంది వెళ్లి వారి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. పెన్షనర్స్ భవన్‌లో కచేరి చేస్తూ నవ్వులు పూయిస్తూ సరదాగా గడిపేస్తున్నారు. అప్పుడప్పుడు విహారయాత్రలకు కూడా వెళుతున్నారు.

సేవా కార్యక్రమాలు కూడా చేపడుతూ..

ఒక నెలలో వచ్చే రిటైర్డ్ ఉద్యోగులందరి జన్మదిన వేడుకలను ఆ నెలలో ఒకరోజు నిర్వహించి కేక్ కట్ చేయించి వారిని ఘనంగా సత్కరించే కార్యక్రమం చేపడుతున్నారు. అదేవిధంగా 10వ తరగతిలో ప్రతిభ కనభర్చిన విద్యార్థులకు తమ వంతుగా నగదు ప్రోత్సాహకాలు ఇచ్చి సత్కరిస్తున్నారు. అనాథాశ్రమాలకు పాత దస్తులు, నగదు సాయం చేసి తమ సేవాభావాన్ని కూడా చాటుకుంటున్నారు.

ఆరోగ్యంపై ఎన్నో జాగ్రత్తలు

ఆటపాటలకే కాదు ఆరోగ్యానికి కూడా రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. హైదరాబాద్, వరంగల్ వంటి పెద్ద పెద్ద పట్టణాల నుంచి ప్రముఖ వైద్యులను పిలించుకొని విశ్రాంత ఉద్యోగుల భవనంలోనే వైద్య శిబిరాలను నిర్వహిస్తూ దూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి అండగా నిలుస్తున్నారు. అంతేకాకుండా కుమారులు, కుమార్తెలు ఇతర దేశాలల్లో ఉన్న వారికి ఈ విశ్రాంత భవనాలే ఒంటరితనాన్ని దూరం చేస్తూ ఆనందంగా, ఉల్లాసంగా జీవించడానికి దోహదపడుతున్నాయి.

“ మనసు ప్రశాంతంగా ఉంటుంది



ఇంట్లో ఉండి టీవీ చూసి గడిపే కంటే పెన్షనర్లం అంతా ఒకచోటుకు వచ్చి నచ్చిన ఆటలు ఆడితే మనసు ప్రశాంతంగా ఉంటుంది. సెల్‌ఫోన్లు చూసినా అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. మాలో మేము కబుర్లు చెప్పుకుంటూ ఉంటే సమయమే తెలియదు.

- యాద వాసుదేవ్, రిటైర్డ్ ఉద్యోగుల నల్లగొండ పట్టణ కార్యదర్శి

“ కబుర్లు చెప్పకుంటూ కాలక్షేపం



క్యారమ్స్, చెస్ ఆడుతుంటే వృద్ధాప్యంలో ఉన్నామనే ఆలోచనే మర్చిపోతాం. వృద్ధాప్యంలో వచ్చే సమస్యలను పంచుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నాం. మాలో చాలామంది పాటలు కూడా చాలా చక్కగా పాడుతూ నవ్విస్తుంటారు.

- జి. రవీందర్, రిటైర్డ్ టీచర్, నల్లగొండ

“ బాధలు మర్చిపోయేలా..



విశ్రాంత జీవితాన్ని భారంగా ఉల్లాసంగా గడిపేలా.. పిల్లలు దూరంగా ఉన్న వారికి, జీవిత భాగస్వాములను కోల్పోయిన వారు బాధలు మర్చిపోయేలా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం. రెండు నెలల క్రితం కోదాడలో రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించాం.

- వేనేపల్లి శ్రీనివాసరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం కోదాడ పట్టణ అధ్యక్షుడు


కోదాడ: క్యారమ్స్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

సామూహిక జన్మదిన వేడుకలు


సామూహిక జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో మే నెలలో జన్మించిన రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టినరోజు జరుపుకున్న రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య, కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, రఘువరప్రసాద్, విద్యాసాగర్, పొట్టా జగన్మోహన్ రావు, అమృతారెడ్డి, వరప్రసాద్, భిక్షం పాల్గొన్నారు.

“ అంతా కలిసికట్టుగా ఉంటాం



రిటైర్డ్ అయిన తర్వాత ఇంట్లోనే ఉంటే లేనిపోని ఆలోచనలతో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. పది మందిమి ఒక చోట చేరి కష్టసుఖాలు పాలుపంచుకుంటే మనసు తేలికంగా ఉంటుంది. ఆపద సమయంలో మేమున్నామని ఒకరికి ఒకరం సహకారం అందించుకుంటూ కలిసికట్టుగా ఉంటాం.

- గజవెల్లి సత్యం, రిటైర్డ్ ఉద్యోగుల నల్లగొండ పట్టణ అధ్యక్షుడు

పంతంగి టోల్‌ప్లాజాలో నిలిచిపోయిన వాహనాలు

- సాంకేతిక సమస్యతో అర్ధగంట పాటు పనిచేయని ఫాస్టాగ్ స్కానర్
- ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ జాం


నిలిచిపోయిన వాహనాలు

చౌటుప్పల్ రూరల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజాలో సాంకేతిక సమస్యతో శనివారం ఉదయం అర్ధగంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఫాస్టాగ్ స్కానర్ పనిచేయకపోవడంతో టోల్‌ప్లాజాకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. టోల్‌ప్లాజా సిబ్బంది వాహనాల నంబర్లను ఫొటో తీసుకుని వాహనాలను పంపించారు. పంతంగి టోల్‌ప్లాజాలో ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసినప్పటికీ తరచూ సాంకేతిక సమస్య తలెత్తుతోంది. టోల్‌ప్లాజా సిబ్బంది సాంకేతిక సమస్య ఏర్పడినప్పుడు వాహనదారులతో గొడవకు దిగుతుండడంతో ఇబ్బందిగా ఉందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు స్పందించి టోల్‌ప్లాజాల వద్ద ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నిక


శ్రవణ్‌కుమార్, అధ్యక్షుడు

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నికలు శనివారం నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎం. శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రుకోధర్, ఉపాధ్యక్షుడిగా వి. తారకేశ్వరి, సహాయ కార్యదర్శిగా వి. శ్యాంసుందర్ రెడ్డి, శ్యాంసుందర్ ప్రసాద్, కోశాధికారి నిర్మలాదేవి, ప్రచార కార్యదర్శిగా కట్టా నాగయ్య, కార్యవర్గ సభ్యులుగా కుసుమశ్రీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాల పటిష్టతకు సహకారం అందిస్తామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వృద్ధురాలు అదృశ్యం


ఎల్లమ్మ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు అదృశ్యమైంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం. యాద్గార్‌పల్లికి చెందిన అన్నపురి ఎల్లమ్మ(60) గత నెల 27వ తేదీ ఉదయం నుంచి కనబడట్లేదు. రెండు నెలలుగా ఎల్లమ్మకు మతిస్థిమితం సరిగా లేదని ఆమె కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎంత వెతికినా ఎల్లమ్మ ఆచూకీ తెలియకపోవడంతో ఆమె మనుమడు అన్నపురి జయంత్ శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మైసయ్య (ఫైల్)

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీలో నివాసముంటున్న గుర్జి మైసయ్య(60) శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మైసయ్యకు కొంత కాలంగా ఆరోగ్యం సరిగా ఉండడంలేదు. కుటుంబ సభ్యులు అతడికి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స సైతం చేయిస్తున్నారు. అయినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనోవేదనకు గురవుతున్నాడు. హైదరాబాద్‌లో తన కుమారుడు శివకుమార్ వద్ద ఉంటున్న మైసయ్య శుక్రవారం చౌటుప్పల్‌కు వచ్చాడు. శివకుమార్ అదే రోజు తన తల్లి అండాలును తన వెంట హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మైసయ్య శుక్రవారం రాత్రి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గుర్తించి మైసయ్య కుమారుడికి సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యాదగిరిగుట్ట క్షేత్రంలో భక్తుల రద్దీ


ఆలయ ముఖ మండపంలో స్వామివారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు


త్రితల ద్వారం నుంచి ప్రధానాలయంలోకి వెళ్తున్న భక్తులు

- స్వామివారిని దర్శించుకున్న 40వేల మందికి పైగా భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా తరలివస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, మాడ వీధుల్లో భక్తులు అధికంగా కనిపించారు. స్వామివారి ధర్మ దర్శనానికి 3గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి గంటకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని 40వేలకు పైగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిత్యాదాయం రూ.56,14,289 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు..

బీబీనగర్: వారాంతం కావడంతో బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం వాహనాల రద్దీ నెలకొంది. హైదరాబాద్ నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భారీగా తరలిరావడంతో వరంగల్ వెళ్లే వైపు వాహనాలు బారులుదీరాయి.



గూడూరు టోల్‌ప్లాజా వద్ద భువనగిరి వైపు నిలిచిన వాహనాలు

చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

మిర్యాలగూడ టౌన్ : చెక్కు బౌన్స్ కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10లక్షల జరిమానా లేదా మరో ఏడాది జైలు శిక్ష విధిస్తూ మిర్యాలగూడ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి. పవన్‌కుమార్ శనివారం తీర్పు వెలువరించారు. వివరాలు.. మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన సారెడ్డి సైదిరెడ్డికి అదే గ్రామానికి చెందిన ఇంద్రసేనారెడ్డి రూ.5లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. 2021 డిసెంబరు 8న రెండు చెక్కులు ఇచ్చాడు. దీంతో సైదిరెడ్డి బ్యాంకుకు వెళ్లి చెక్కులను తన ఖాతాలో జమచేయాలని కోరగా ఇంద్రసేనారెడ్డి ఖాతాలో డబ్బులు లేవని బ్యాంకు సిబ్బంది చెక్కు వాపస్ ఇచ్చారు. దీంతో సైదిరెడ్డి న్యాయవాది ద్వారా కోర్టును ఆశ్రయించాడు. చెల్లని చెక్కులు ఇచ్చినట్లు నేరం రుజువు కావడంతో ఇంద్రసేనారెడ్డి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- మహిళపై దాడి
- పోలీసులపై కూడా తిరగబడ్డ యువకులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

మునగాల: మద్యం మత్తులో ఆరుగురు యువకులు మహిళపై దాడి చేశారు. అంతేకాకుండా అడ్డుకోబోయిన పోలీసులపై తిరగబడి వారి విధులకు ఆటంకం కల్గించారు. ఈ ఘటన శనివారం మునగాల మండల కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన మామిడి ఎల్లయ్య మునగాల మండల కేంద్రానికి చెందిన చలమల త్రివేణిని మూడు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో త్రివేణి సోదరుడి స్నేహితుడైన పిట్టల గోపి మూడు నెలల కిందట ఎల్లయ్య కుటుంబంతో ఘర్షణ పడ్డాడు. దీనిని మనసులో పెట్టుకుని శనివారం మామిడి ఎల్లయ్య తన స్నేహితులైన ఎలుగూరి గోపి, ఎలుగూరి గోపి, బండారు గోపాలకృష్ణ, మిట్టగణుపుల నవీన్, సిగ వీరబాబుతో కలిసి పిట్టల గోపి ఇంటి వద్దకు చేరుకొని వీరంగం సృష్టించారు. అడ్డుకోబోయిన గోపి తల్లి సీతరావమ్మను దూషించి ఆమెపై చేయి చేసుకోవడమే కాకుండా చంపుతామని బెదిరించారు. సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది శ్రీనివాసరావు, శ్రీకాంత్, బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని యువకులను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. మద్యం మత్తులో ఉన్న యువకులు పోలీసు సిబ్బందిపై తిరగబడి వారి విధులను ఆటంకం కల్గించారు. దీంతో కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్మికుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు

- విద్యుత్ ఉద్యోగుల సంఘం–327 రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీధర్


సంఘం జెండా ఆవిష్కరిస్తున్న శ్రీధర్

నల్లగొండ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్, ప్రైవేట్ కలెక్షన్ ఏజెంట్లు, స్పాట్ బిల్లింగ్, స్టోర్ హమాలీ, వివిధ కార్మికుల సమస్యలపై త్వరలోనే ప్రభుత్వంతో చర్చలు జరపనున్నట్లు విద్యుత్ ఉద్యోగుల సంఘం–327 (ఐఎన్‌టీయూసీ అనుబంధం) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో మే డే ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్ రోడ్డులోని మీటింగ్ హాల్‌లో శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంతో చర్చలు జరపడానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సమయం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధ్యక్షుడు సురేష్ కుమార్, సంఘం జిల్లా అధ్యక్షుడు అమర్‌కుమార్‌రెడ్డి, ఎస్‌పీడీసీఎల్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, నల్లగొండ డివిజన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి సమిరెడ్డి, కార్యదర్శి పాండు, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వరరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు జలకళ

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. పదిరోజుల నుంచి ఎగువన ఉన్న హైదరాబాద్ నగరంతో పాటు ఆలేరు, జనగామ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద నీరు వస్తుండటంతో మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. శనివారం మూసీ ప్రాజెక్టుకు 874 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా.. శనివారం సాయంత్రానికి 639.50 అడుగులకు చేరుకుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో మరో ఐదు అడుగుల నీరు చేరితే గేట్లు పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశముంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 3.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


వరద నీటితో కళకళలాడుతున్న మూసీ ప్రాజెక్టు

కుమార్తె వివాహం చేసిన మరుసటి రోజే..


కృష్ణవేణికి తలకొరివి పెట్టిన చిన్న కుమార్తె మనీషా


నలుగురు కుమార్తెలతో కృష్ణవేణి (ఫైల్)

- క్యాన్సర్‌తో పోరాడుతూ మహిళ మృతి

మర్రిగూడ: క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళ కుమార్తె వివాహం చేసిన మరుసటి రోజే మృతిచెందింది. ఈ ఘటన మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లెంకలపల్లి గ్రామానికి చెందిన గుండ్ల కృష్ణవేణి (40) భర్త పదేళ్ల క్రితమే మృతిచెందాడు. ఆమెకు నలుగురు కుమార్తెలు సంతానం. భర్త మృతిచెందినప్పటికీ కూలీ పనులు చేసుకుంటూ నలుగురు కుమార్తెలకు చదివించింది. ఈ క్రమంలోనే ఆమె క్యాన్సర్ బారిన పడింది. క్యాన్సర్‌తో పోరాడుతూనే ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోయినా కష్టపడి ఇద్దరు కుమార్తెల వివాహం కూడా చేసింది. శుక్రవారం మూడో కుమార్తె వివాహం చేసిన ఆమె.. క్యాన్సర్‌తో పోరాడుతూ శనివారం మృతిచెందింది. కుమార్తె వివాహం చేసిన మరుసటి రోజే కృష్ణవేణి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ఆదర్శ పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తిచేసిన కృష్ణవేణి నాల్గో కుమార్తె మనీషా ఆమెకు తలకొరివి పెట్టింది. తన ఉన్నత చదువులకు సహకరించేదెవరని, తన బాధ్యతను ఎవరు చూసుకుంటారని మనీషా ఏడ్చిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. లెంకలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు మేతరి శంకర్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ ఐతగోని రేణుకావెంకటయ్యగౌడ్ కృష్ణవేణి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందచేశారు.